'నాడు - నేడు' పనుల్లో అవకతవకలపై
కలెక్టర్‌కు సిపిఎం సర్పంచ్ ఫిర్యాదు

ప్రజాశక్తి -అనంతగిరి : పాఠశాలలో నాడు నేడు నిధులతో చేపట్టే పనుల్లో అవకతవకలపై జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు టోకూరు పంచాయతీ సిపిఎం సర్పంచ్ కిల్లో. మొస్య తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పాఠశాలలను నాడు నేడు పథకం కింద అభివృద్ధి చేసి అన్ని మౌలిక వసతులు కల్పించాలని నిధులు మంజూరు చేస్తుంటే, టోకూరు పంచాయతీ బలియాగుడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రెండో విడతగా నాడు నేడు కింద సుమారు రూ.34.71 లక్షల నిధులు కేటాయించగా ఆ నిధులతో పనులు చేపట్టకుండా దుర్వినియోనికి పాల్పడిన హెచ్‌ఎం ప్రభాకర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ సబ్యులు. లక్ష్మణరావు పాల్గొన్నారు.

అంతా బురదమయం..

- ★ చురుగ్గా శానిటేషన్ పనులు
- ★ వరద ముంపు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు
- ★ సహాయ చర్యలు ముమ్మరం
- ★ జాతీయ రహదారులకు మరమ్మతులు

ఇళ్లలోనూ, వీధుల్లో ఉన్న బురదను తొలగిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -చింతూరు

పది రోజులకు పైగా పొంగి ప్రవహించిన గోదావరి, శబరి నదులు శాంతించాయి. సోమవారం రాత్రికి పూర్తిగా వరద తొలగిపోవడంతో అటు ప్రజలు, ఇటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పది రోజుల పాటు భయం గుప్పెట్లో ఉన్న బాధితులు గ్రామాలకు చేరుకుంటున్నారు. వరద ఉధృతి తగ్గినా, ముంపునకు గురైన గ్రామాలన్నీ బురదతో నిండి ఉన్నాయి. పలు ఇళ్లు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం చింతూరు మండలంలోని కల్లేరు, చట్టి, కొమ్మూరు, ముకునూరు, ఏజ్ కోడేరు, చింతూరు తదితర గ్రామాల్లో అధికారులు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. బురద తొలగించి బ్లీచింగ్ చల్లారు. దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేస్తున్నారు. చింతూరు నుండి విఆర్ పురం వెళ్లే రహదారిలో జలివారిగూడెం వాగు వద్ద సప్టాపై, సోకులేరు వాగుపై చేరుకున్న బురదను బుల్‌డోజర్ల సాయంతో తొలగించారు. చింతూరు నుండి సంతపాకలు వెళ్లేదారిలో వరదలకు కొట్టుకొచ్చిన చెత్తాచెదారాన్ని గ్రామపంచాయతీ సెక్రటరీ ప్రసాద్ ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన తొలగించి శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టారు. ఎర్రంపేటలోని ఐటిడిఎ ముందు రహదారిపై చెత్తాచెదారం తొలగించి బ్లీచింగ్ చల్లారు. చింతూరు నుండి ఒడిశా వెళ్లే జాతీయ రహదారి 326 వరదలకు కొట్టుకుపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ సెక్రెటరీ సురేష్ ఆధ్వర్యంలో మరమ్మతులు గావించారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఐటిడిఎ పిఓ సూరజ్ గనేరో పర్యవేక్షణలో సహాయ కార్యక్రమాలు, పారిశుధ్య కార్యక్రమాలు, నిత్యవసర వస్తువుల పంపిణీ చురుగ్గా జరుగుతున్నాయి. ముంపునకు గురైన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు.

పారిశుధ్య పనుల ముమ్మరం

విఆర్.పురం : వరదలకు పెద్ద ఎత్తున చెత్తా చెదారం పేరుకు పోవడంతో పాటు రోడ్లు, ఇళ్లు బురదతో నిండి ఉన్నాయి. దీంతో మండలంలోని వడ్డిగూడెం, వడ్డిగూడెం కాలనీలో పేరకపోయినా చెత్తను ట్రాక్టర్లతో డంప్ చేస్తున్నారు. ఫైర్ ఇంజన్‌తో బురదను క్లీన్ చేయించారు. పంచాయతీ కార్యదర్శి స్వరూప రెడ్డి మెయిన్ రోడ్‌లో పారిశుధ్యం పనులు ముమ్మరం చేయించారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో రోడ్లన్నీ బురద మయంగా ఉండటంతో స్థానిక ఎస్ఐ దుర్గాప్రసాద్ నేతృత్వంలో బురద తొలగించే చర్యలు చేపట్టారు. హెడ్ కానిస్టేబుల్స్ విక్టర్, శ్రీను అగ్నిమాపక శాఖ సిబ్బంది, రెస్కు సిబ్బంది సంయుక్తంగా అంతర్గత వీధుల్లో ఉన్న బురదను ఫైర్ ఇంజన్ సహాయంతో తొలగించారు. ఈ కార్యక్రమంలో కూనవరం అగ్ని మాపక శాఖ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫైర్ ఇంజన్‌తో వీధుల్లో ఉన్న బురదను తొలగిస్తున్న సిబ్బంది

వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కూరగాయల పంపిణీ

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని రేఖపల్లి పంచాయతీ పరిధి గొల్లగూడెం గ్రామంలో గోదావరి వరద బాధితులకు కూరగాయలను ఎంపీపీ కారం లక్ష్మి, స్థానిక సర్పంచ్ పూనెం సరోజిని, ఎంపీటీసీ బంధం విజయలక్ష్మి, సిపిఎం నాయకులు జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. అలాగే శ్రీరామగిరి పంచాయతీ స్థానిక సర్పంచ్ పులి సంతోష్ కుమార్ చేతులమీదుగా శ్రీరామగిరి, చొక్కనపల్లి గ్రామాల ప్రజలకు మంచి నూనె పంపిణీ అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పంకు సత్తిబాబు, ప్రకాష్ రావు, తాడం రాజు, రేఖపల్లి సెక్రెటరీ శివప్రసాద్, వార్డ్ మెంబర్ సోలార్ కృష్ణవేణి, సోల ఏసుబాబు, గోసుల సాయిబాబు, శ్రీరామగిరి మాజీ సర్పంచ్ తోడం చిన్నబాయమ్మ, వార్డు మెంబెర్లు పూసం రవివర్మ, గొంది దారయ్య, సున్నం సీతమ్మ, కోట్ల సీతామహాలక్ష్మీ, పంచాయితీ కార్యదర్శి సౌజన్య, వాలంటీర్లు పాల్గొన్నారు.

రేఖపల్లిలో కూరగాయలు అందిస్తున్న ఎంపిపి లక్ష్మి, సర్పంచ్ సరోజినీ తదితరులు

కూనవరం : మండలంలోని ముల్లూరు గ్రామంలో వరద బాధితులకు ఉల్లిపాయలు, బంగాళదుంపలు, పాల ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సర్పంచ్ బొగ్గా వెంకమ్మ, మాజీ సర్పంచ్ పాయం సీతారామయ్య, మాజీ ఎంపిటిసి మేకల నాగేశ్వరరావు, పంచాయతీ అధికారులు, పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కుమ్మూరు గ్రామస్తులు

ఐటిడిఎ పిఒకు వినతిపత్రం ఇస్తున్న వైస్ ఎంపిపి పెంటయ్య, సిపిఎం నేతలు

41.15 కాంటూర్‌లో కలపాలని వినతి

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని కుమ్మూరు గ్రామాన్ని 41.15 కాంటూరులో కలపాలని ఆ గ్రామస్తులు మంగళవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను ఐటిడిఎ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కుమ్మూరు ఉప సర్పంచ్ పాయం మారయ్య, కురుసం వెంకన్న బాబు, అనిగి చంద్రయ్య, బొగ్గ వెంకటయ్య, నరేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

ముంపు బాధితులకు భోజనాలు

ప్రజాశక్తి- విఆర్.పురం : మండలం కేంద్రం రేఖపల్లి పునరావాస గుడారాల వద్ద వరద బాధితులు 2000 మందికి తెలుగు దేశం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంలో మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వరదలతో ఇల్లు వదిలి పునరావాస కేంద్రాలకు వచ్చిన బాధితులకు జగన్ రెడ్డి ప్రభుత్వం కేజీ ఉల్లిపాయలు, కేజీ వంకాయలు, కేజీ కందిపప్పు, పాల ప్యాకెట్ మాత్రమే ఇచ్చి చేతులు దులుపేసుకుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు, టిడిపి నాయకులు ఆచంట శ్రీనివాస్, బురక కన్నారావు, గొర్ల సునీత, ఎంపీటీసీ వాళ్ల వెంకటేశ్వర రెడ్డి, బరపాటి ప్రకాష్ రావు, బీరక సూర్య ప్రకాష్ రావు, వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, మల్లికార్జునరావు, సీపీఎం ఎంపీపీ కారం లక్ష్మి, సీపీఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, పెట్ట శివ పాల్గొన్నారు.

భోజనాలు వడ్డిస్తున్న టిడిపి నాయకులు

వరద బాధితుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి- కూనవరం : మండలంలో వరద బాధితుల సమస్యలపై సీపీఎం ప్రజా ప్రతినిధులు మంగళవారం ఐటీడీఏ పిఓ సూరజ్ గనోరేకు వినతిపత్రం సమర్పించారు. ముంపు మండలాల్లో వరద బాధితులకు బియ్యం, మంచి నూనె, ఉల్లిపాయలు బరకాలు అందరికీ అందేలా చూడాలని కోరారు. ముంపు గ్రామాల్లో బరకాలు నిత్యావసరాలు ఒకరికి వస్తే ఒకరికి ఇవ్వలేదన్నారు. వరదలకు విద్యుత్ అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగకరమైన కోతులు గుట్ట నుండి ఏడుగురాళ్లపల్లి వరకు రోడ్డు నిర్మించాలని పలుమార్లు విన్నవించినా చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. బురదగుడి నుంచి వేకవారిగూడెం రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. దీనికి ఐటిడిఎ పిఒ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సర్పంచ్ నాగమణి, ఎంపీటీసీ ధర్మల్ అమ్మాజీ, సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, కట్టం ప్రభాకర్, పాయం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు నిర్వహించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఎటపాక : గోదావరి వరద వల్ల ముంపునకు గురైన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సిపిఎం మండల కార్యదర్శి ఐవి, నాయకులు ఆకిశెట్టి రాము డిమాండ్ చేశారు. మంగళవారం వారు ముంపు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరదలు తగ్గుముఖం పట్టినప్పటికీ సీజనల్ వ్యాధులు, వరదల కారణంగా వచ్చే వ్యాధుల ప్రమాదం పొంచి ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వైద్య అధికారులు అప్రమత్తంగా ఉండి వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు.

ప్రజలతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు ఐవి, రాము

రేపే మన్యం బంద్

- ▶▶ మణిపూర్ హింసాకాండపై ఆదివాసీల తీవ్ర నిరసన
- ▶▶ బంద్‌కు పిలుపునిచ్చిన ఆదివాసీ గిరిజన ప్రజా సంఘాలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మణిపూర్‌లో ఆదివాసీలపై మారణహోమం, హింసాకాండ, అఘాయిత్యాలు, అల్లర్లపై ఆదివాసీల్లో ఆగ్రహావేశాలు పెరుగుతున్నాయి. మణిపూర్‌లో జరిగిన హేయమైన సంఘటనలను నిరసిస్తూ, ఘటనలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ఈ నెల 3న గురువారం రాష్ట్రవ్యాప్త మన్యం బంద్‌కు ఆదివాసీగిరిజన సంఘం, ఆదివాసీ ప్రజా సంఘాలు సంయుక్తంగా పిలుపునిచ్చాయి. మణిపూర్ బాధితులకు, ప్రజలకు సంఘీభావంగా అల్లూరి జిల్లా మన్యం వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు నిరసన చేపడుతున్నారు.

మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళలను వివస్త్రలను చేసి, ఊరేగించిన ఘటనతో దేశం యావత్తు రగిలిపోయింది. వారిలో ఒక మహిళపై సామూహిక అత్యాచారానికి తెగబడడం, ఆమెను కాపాడేందుకు వెళ్లిన కుటుంబ సభ్యులిద్దరినీ హత్య చేయడం వంటి చరిత్రలో ఎన్నడూ చూడని దుర్ఘటనలతో మణిపూర్ దురాగతాలు దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇలాంటి ఘాతుకానికి పాల్పడిన నేరస్తులకు రక్షణ కల్పించడానికి మణిపూర్‌లోని బిజెపి ప్రభుత్వం సహాయపడుతోందని, మణిపూర్ దుర్మార్గాలను ప్రోత్సహించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఆదివాసీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఆందోళనలు, నిరసన నిర్వహిస్తున్నారు.

అలాగే ఏజెన్సీ ఆదివాసీలకు శతశాతం ఉద్యోగవకాశాలను కల్పించే జిఒ3కు చట్టబద్ధత కల్పించాలని, ఆదివాసీల మనుగడను దెబ్బతీసే బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ వైసిపి ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని, పోలవరం వరద బాధితులకు పునరావాస కేంద్రాలు కల్పించాలని తదితర డిమాండ్లతో రాష్ట్రవ్యాప్త మన్యం బంద్‌కు ఆదివాసి గిరిజన ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి. దేశంలో, రాష్ట్రంలో ఆదివాసీలపై జరుగుతున్న భౌతిక, రిజర్వేషన్ల దాడులకు వ్యతిరేకంగా గురువారం బంద్ ను సంపూర్ణంగా విజయవంతం చేసి, తమ నిరసనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బలంగా తెలియజేయాలన్న పట్టుదలతో గిరిజనులు ఉన్నారు.

ఆదివాసీ సమస్యలపై నోరుమెదపని ప్రజాప్రతినిధులు..

మునుపెన్నడూ లేనంతగా ఆదివాసీల హక్కులు, చట్టాలు, రిజర్వేషన్లపై ముప్పు వాటిల్లుతున్నా, గిరిజన ప్రజా ప్రతినిధులు నోరుమెదపకపోవడాన్ని మన్యవాసులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బోయ/ వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చే వైనంపైనా నోరు మెదపడం లేదని గిరిజన, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో. గిరిజనుల రిజర్వేషన్లు, హక్కులు, చట్టాల ప్రయోజనాలకు తీవ్ర నష్టం కలుగుతున్నా ప్రజా ప్రతినిధులు వ్యవహరిస్తున్న తీరుపై మండిపడుతున్నారు. అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని గిరిజన ప్రజా ప్రతినిధులు అడ్డుకోలేదని, తర్వాతైనా గిరిజనులకు అన్యాయం జరుగుతుందనే విషయాన్ని ప్రభుత్వ పెద్దలు దష్టికి తీసుకెళ్లలేదంటూ గిరిజన ద్రోహులుగా అభివర్ణించి, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు.తాజాగా బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చాలన్న రాష్ట్ర ప్రభుత్వ తీర్మానంపై కేంద్రం సత్వరమే చర్యలు తీసుకోవాలని పార్లమెంట్‌లో వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి ఒత్తిడి చేయడంతో మరింత రగిలిపోతున్నారు.

ఆదివాసీల ఉద్యోగ అవకాశాలకు సంబంధించిన జిఒ3ను సుప్రీంకోర్టు కొట్టి వేయడం, ఆ తర్వాత షెడ్యూల్ ప్రాంత ఉపాధ్యాయ పోస్టులలో గిరిజనులకు శతశాతం రిజర్వేషన్ కల్పించాల్సిన అవసరం లేదని వైసిపి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం షెడ్యూల్ ప్రాంతంలో నిరుద్యోగ యువతకు, భవిష్యత్ తరాలకు తీరని అన్యాయం.దీనిపై టిఎసిలో తీర్మానం చేసినప్పటికీ, దానిని సైతం పరిగణలోకి తీసుకోకుండా ఇటువంటి ఉత్తర్వులు జారి చేయడం ఆదివాసీల రిజర్వేషన్లపై వైసిపి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతోంది. ఎంపి, ఎమ్మెల్యేలతో పాటు ఎస్‌టి కమిషన్ చైర్మన్, మెంబర్లు, జడ్‌పి చైర్ పర్సన్, జిసిసి చైర్‌పర్సన్, ట్రైకార్ చైర్మన్ సైతం తమ వ్యక్తిగత లబ్ధి కోసం తప్ప గిరిజనులకు మేలు చేసేందుకు ఎటువంటి ప్రయత్నాలు చేయడం లేదని ఆదివాసీలు ఆరోపిస్తున్నారు. వీరంతా ఆదివాసీల హక్కులు, చట్టాలు, రిజర్వేషన్లపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరును వ్యతిరేకిస్తూ వెంటనే తమ పదవులకు రాజీనామా చేసి ఆదివాసీల మనుగడ సమస్యలపై పోరాడాలని డిమాండ్ చేస్తున్నారు.

బంద్ జయప్రదానికి నేతల పిలుపు

పాడేరులో బైక్ ర్యాలీ

పాడేరు :మణిపూర్‌లో ఆదివాసీలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఆగస్టు 3న తలపెట్టిన రాష్ట్ర మన్యం బందును విజయవంతం చేయాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. సురేంద్ర, రాష్ట్ర నాయకులు అప్పలనర్స పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి మెయిన్ రోడ్ అంబేద్కర్ సెంటర్ మీదుగా పాత బస్‌స్టాండ్ వరకు ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశం మాట్లాడుతూ మణిపూర్‌లో ఆదివాసీలపై కార్పొరేట్ మతోన్మాద శక్తులు జరుపుతున్న మారణహోమాన్ని తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. తెగల మధ్య గొడవల పెట్టే బిజెపి రాజకీయాలను వ్యతిరేకించాలని కోరారు. బైక్ ర్యాలీలో జిల్లా అధ్యక్షుడు ఎస్.ధర్మాన పడాల్, కార్యదర్శి పి.బాలదేవ్, జిల్లా నాయకులు కె.నర్సయ్య, చిట్టిబాబు, సర్బ నాయుడు, కుమారి, సుందరరావు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: గిరిజనులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక వైఖరికి నిరసనగా ఈనెల 3న చేపట్టే రాష్ట్రవ్యాప్త మన్యం బంద్ జయప్రదం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు కె త్రినాథ్, మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను పిలుపునిచ్చారు. మణిపూర్ ఆదివాసులపై కార్పొరేట్ మతోన్మాద శక్తుల పైశాచిక మరణకాండ ఆపాలని, నూతన అటవీ సంరక్షణ చట్టం సంస్కరణలను నిలిపేయాలని, జిఒ3కు చట్టబద్ధత కల్పించాలని,ఏజెన్సీలో ఖాళీ పోస్టుల భర్తీ, మన్యవాసులు కనీస సౌకర్యాల కల్పన వంటి డిమాండ్లతో ఈ బంద్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. బోయ/వాల్మీకి, బెంతుఒరియా తదితర గిరిజనేతలకు ఎస్‌టిజాబితాలో చేర్చాలన్న నిర్ణయం వెంటనే వెనక్కు తీసుకోవాలని కోరారు గిరిజన సంఘం మండల కమిటీ సభ్యుడు రామదాసు పాల్గొన్నారు.

జి.మాడుగుల: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆదివాసీ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆదివాసీ గిరిజన సంఘాల పిలుపు మేరకు ఈనెల 3న నిర్వహించే రాష్ట్రవ్యాప్త మన్యం బంద్ విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మన్నపడాల్ కోరారు. ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి కొటారి కోటేశ్వరరావు, జే దీనబంధు, ఆదివాసీ గిరిజన మహిళ సంఘం మండల అధ్యక్షురాలు ఎ. శ్రీ లత లు పాల్గొన్నారు.

విఆర్.పురం : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేపట్టిన అటవీ సంరక్షణ చట్ట సవరణ, బోయవాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చటాన్ని వ్యతిరేకిస్తూ, మణిపూర్‌లో ఆదివాసీలపై హింస జరుగుతున్నా మోడీ ప్రభుత్వ మౌనాన్ని నిరసిస్తూ ఆదివాసీ గిరిజన సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 3న జరగనున్న రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలపై కక్ష కట్టిన రీతిలో వ్యవహరిస్తున్నాయని, గిరిజన చట్టాలని, హక్కులను హరిస్తున్నాయన్నారు.వరదల నేపథ్యంలో బంద్ సందర్భంగా చింతూరు, కూనవరం, విఆర్.పురం, ఎటపాక మండలాల్లో నిరసన చేస్తామని, మిగిలిన 7 మండలాల్లో బంద్ నిర్వహిస్తామన్నారు కాక అర్జున్ అధ్యక్షతన సమావేశంలో పూనెం ప్రదీప్ కుమార్, ఇర్పా అజయ్, నక్కా సూరిబాబు, బొర్రయ్య, కారం నాగేష్, బి.రాములమ్మ పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : స్థానిక ఆదివాసీ జేఏసీ కార్యాలయం వద్ద మంగళవారం సమావేశం జరిగింది. ఇందులో జేఏసీ కన్వీనర్ వంతు బాలకృష్ణ మాట్లాడుతూ మణిపూర్‌లో ఇటీవల జరిగిన మారణ హోమం ఆపాలని, బీరెన్ సింగ్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని, అటవీ హక్కుల చట్టం యథావిధిగా అమలు చేయాలి, గిరిజన సాగులో ఉన్న కొండపోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. జెఏసీ నాయకులు గంప నాగరాజు, ఈ శ్రీను, తెడ్ల రాంబాబు, ఈరే రాజబాబు, బి రామకృష్ణ, వజ్రపు అప్పారావు, తాము సూరిబాబుపాల్గొన్నారు.

విఆర్‌పురంలో మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

ముంచంగిపుట్టులో మాట్లాడుతున్న త్రినాధ్

జి.మాడుగులలో మాట్లాడుతన్న ధర్మన్న పడాల్

కుండపోత వర్షంతో జనం ఇక్కట్లు

కొట్టుకుపోయిన కల్వర్టును పరిశీలిస్తున్న వెంకటలక్ష్మి

ప్రజాశక్తి -జి.మాడుగుల: మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల, గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి చెరువులను తలపించేలా పంట పొలాలు దర్శనమిచ్చాయి బీరం పంచాయితీ మత్స్యపురం నుండి బొడ్డపోటు గ్రామానికి వెళ్లే మార్గమధ్యలో తాత్కాలికంగా నిర్మించిన కల్వర్టు వరద ఉద్రిక్తతకు కొట్టుకుపోయింది, అలాగే పలుచోట్ల తాత్కాలిక, వంతెనలు కొట్టుకుపోయాయి. ఎడతెరిపి లేని వర్షానికి దిగరాపల్లి గ్రామంలో బట్టి గున్నమ్మకు చెందిన ఇల్లు వెనుక భాగం పూర్తిగా శిధిలమైంది, పలుచోట్ల రహదారులు దెబ్బతిన్నాయి.వర్ష ఉధృతికి ఎక్కువగా ఉన్న బీరం, నుర్మతి పంచాయతీలలో బీరం, బొడ్డపుట్టు, నుర్మతి, బోయితిలి ప్రాంతాలలో మంగళవారం రాష్ట్ర ఎస్‌టి సెల్ అధ్యక్షురాలు డాక్టర్ వెంకటలక్ష్మి, పర్యటిం చారు. నష్టపోయిన రైతులను పరామర్శించారు. మాజీ ఎంపిపి వెంకట గంగరాజు సోలభం సర్పంచ్ హనుమంతరావు, బొంజుబాబు, ప్రకాశ్ పాల్గొన్నారు

నీట మునిగిన పంటపొలాలు

మహిళల పోరుయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -హుకుంపేట: మహిళలపై హింస, మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించాలని డిమాండ్‌తో ఐద్వా చేపడుతున్న రాష్ట్రవ్యాప్త మహిళల పోరుయాత్ర జీపుజాతా జయప్రదం చేయాలని ఐద్వాఅల్లూరి జిల్లా కార్యదర్శి ఎస్ హైమావతి పిలుపునిచ్చారు. మంగళవారం హుకుంపేటలో మహిళల పోరుయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, మహిళలపై హింస, దాడులను అరికట్టాలని కోరారు. మణిపూర్ మారణహోమం ఉదంతాలు ప్రజలందరినీ కలచి వేస్తున్నా,వాటిని నియంత్రించాల్సిన ప్రభుత్వాల్లో కదలిక లేకపోవడం దారుణమన్నారు. మణిపూర్లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి చంపిన వారికి ఉరిశిక్ష వేయాలని, గిరిజనుల పట్ల అమానుషంగా వ్యవహరించి, చంపి భయోత్పాతం సృష్టించడం ద్వారా అక్కడ అటవీ సంపదను కొల్లగొట్టి, కార్పొరేట్లకు కట్టబెట్టాలన్న బిజెపి కుట్రలను తిప్పికొట్టాలన్నారు. ాార్యక్రమంలో రవణమ్మ కళావతి, లక్ష్మి పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐద్వా నేతలు

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎటిడబ్ల్యుఒ పుష్పలత

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి పెట్టండి

ప్రజాశక్తి-పెదబయలు : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని ఎటిడబ్ల్యుఒ కంకిపాటి పుష్పలత సూచించారు. మంగళవారం స్థానిక గిరిజన సంక్షేమ రెసిడెన్సియల్ బాలుర పాఠశాలను సందర్శించారు. ఉదయం పది గంటలకు ఫార్మాటివ్ టెస్ట్ (ఎఫ్ఎ 1) రాస్తుండడంతో 5వ తరగతి నుండి 10 తరగతుల వరకు అన్ని గదులకు వెళ్లి తనిఖీ చేశారు. కొందరు విద్యార్థులకు కండ్ల కలకలు సోకి, నల్లనికంటిఅద్దాలు పెట్టుకుని పరీక్షలు రాస్తుండంపై వారి ఆరోగ్యంపై ప్రిన్సిపల్ డిఎస్.శంకరరావును అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో వంటగదికి వెళ్లి మెనూ అమలును పరిశీలించారు. వంకాయ పప్పు, బంగాళాదుంప, రసంతో విద్యార్థులకు భోజనం వడ్డించగా, వారితో కలిసి భోజనం చేశారు. మెనూ అమలుపై విద్యార్థులను ప్రశ్నించారు. సమస్యలుంటే నేరుగా చెప్పాలని, ఆరోగ్యం పట్ల అప్రమతంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు

ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

ఆదివాసీ దినోత్సవంపై కాంగ్రెస్ ప్రచారం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: ఈనెల 9న జరగనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని మన్యవాసులు ఘనంగా నిర్వహించుకోవాలని కోరుతూ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆదివాసీవిభాగం రాష్ట్ర చైర్‌పర్సన్ పి సంతకుమారి మాట్లాడుతూ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని అరకులోయ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గిరిజన సాంప్రదాయబద్ధంగా థింసానృత్యం, ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ప్రతిబింబించే పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివాసీ దినోత్సవానికి అధిక సంఖ్యలో మహిళలు గిరిజనులు యువత పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పి చిన్నస్వామి, ఆదివాసీ విభాగ కోఆర్డినేటర్ సోమేశ్వరరావు, మండల అధ్యక్షుడు దయానిధి, కార్యదర్శి భీమరావు, మదన్‌రావు, సత్తిబాబు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని సెలవు దినంగా ప్రకటించాలి

ఏటా ఆగస్టు 9న నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని మానవహక్కుల నేర నిరోధక సంఘం అల్లూరి జిల్లా అధ్యక్షుడు పి ధర్మ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ క్రిస్మస్, దసరా, దీపావళి, సంక్రాంత్రి, మొహరం, రంజాన్ వంటి పండగలకు ఏ విధంగా సెలవుదినంగా ప్రకటిస్తారో, అలాగే ఆదివాసీ దినోత్సవం రోజున కూడా సెలవు ప్రకటిస్తే, గిరిజనులు ఆరోజున తమ సంప్రదాయం, ఆచార వ్యవహారాలకు అనుగుణంగా కార్యక్రమాల నిర్వహణకు వీలౌతుందన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు ఉన్నారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు

ప్రజాశక్తి -జి.మాడుగుల: మావోయిస్టు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నేపథ్యంలో మంగళవారం మండల కేంద్రంలో పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు వాహనాలతోపాటు ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక పెట్రోల్ బంకు వద్ద, పలు కూడళ్లలో, అనుమానిత ప్రదేశాల వద్ద డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు.అనుమానిత వ్యక్తులను విచారించి, విడిచిపెట్టారు.కార్యక్రమంలో సిఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాస్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

నూతన అటవీ సంరక్షణ చట్టాన్ని రద్దుచేయాలి

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా వారోత్సవాల ప్రారంభ సభలో నేతలు డిమాండ్

ప్రజాశక్తి -పాడేరు : కేంద్ర ప్రభుత్వ నూతన అటవీ సంరక్షణ చట్టాన్ని రద్దు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి అప్పలనర్స డిమాండ్ చేశారు. మంగళవారం ఈనెల 9న, ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పాడేరు పిఎంఆర్‌సి సమావేశం మందిరంలో నిర్వహించిన 'ఆదివాసీ హక్కుల దినోత్సవం రాష్ట్ర సదస్సు'లో అప్పలనర్స మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల దినోత్సవాల్లో బాగంగా ఆగస్టు 1నుండి 10 తేదీ వరకు గ్రామ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు వివిధ రకాల కార్యక్రమాలతో ఆదివాసీ హక్కుల దినంగా నిర్వహించాలని ఆదివాసీలను కోరారు.
మోడీ ప్రభుత్వం తెచ్చిన నూతన అటవీ సంరక్షణ చట్టం అమలైతే ఆదివాసీ గ్రామసభకు ఉన్న అధికారం హరించుకుపోతుందన్నారు. అడవులు నుండి ఆదివాసీలు గెంటేసే పరిస్థితి వస్తుందన్నారు. కార్పొరేట్ కంపెనీలకు అడవులను కట్టబెట్టెందుకు, ఆదివాసీ వనరులు దోచుకోవడానికి మోడీ ప్రభుత్వం ఇటువంటి నిర్ణయాలు చేసి, చట్టాన్ని తెచ్చిందన్నారు. చట్ట సవరణలో పార్లమెంట్ స్టాంటింగ్ కమిటీ సిఫార్సు కూడా పరిగణలోకి తీసుకోలేదని, కనీసం జాతీయ ఎస్టీ కమిషన్ ,కేంద్ర గిరిజన సంక్షమ శాఖ వారి అభిప్రాయం తీసుకోలేదన్నారు. మోడీ ప్రభుత్వం మణిపూర్ ఘటనపై అవిశ్వాసానికి సంబంధించిన అంశం పార్లమెంట్ స్పీకర్ వద్ద పెండింగ్‌లో ఉండగా, ఏకపక్షంగా నూతన అటవీ సంరక్షణ చట్టాన్ని పార్లమెంట్ సమావేశాల్లోనే బిల్లు ఆమోదింపజేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు..ఆదివాసీల హక్కుల భంగం కలిగించే చట్ట సవరణపై రాష్ట్ర అధికార,ప్రతి పక్ష పార్టీల ఎంపిలు మోడీ ప్రభుత్వానికి పార్లమెంటులో మద్దతు ఇచ్చి ఆదివాసీ ద్రోహులు గా మారారని అన్నారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.ధర్మన పడల్, కార్యదర్శి పి.బాల్ దేవ్, జిల్లా నాయకులు కె.నర్సయ్య, చిట్టిబాబు, సర్బ నాయుడు,కుమారి, సుందర రావు పాల్గొన్నారు.

ఆశ్రమ విద్యార్థుల ఆరోగ్య బాధ్యతలను..

సచివాలయ హెల్త్ సెక్రటరీలకు అప్పగించొద్దు

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి- అరకు రూరల్ : ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ఆరోగ్య బాధ్యతలను గ్రామ సచివాలయ హెల్త్ సెక్రటరీలకు అప్పజెప్పాలన్న రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనను తక్షణం ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం అరకువేలి ఆదివాసి గిరిజన సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఆరోగ్యం అందక అనేక మంది ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుతం సచివాలయ హెల్త్ సెక్రటరీలకు గ్రామంలో సేవలు అందించాల్సిన అసవరం ఉందన్నారు. వారికి పాఠశాలలో బాధ్యతలు అప్పగించడం సరికాదని అన్నారు. వివిధ యాప్ ద్వారా పని ఒత్తిడి పెరుగుతుందన్నారు. గతంలో ఆశ్రమ పాఠశాలలో హెల్త్ వాలంటీర్లు ఉండేవారిని, తక్షణం పాఠశాలలో హెల్త్ వాలంటీర్లు నియమించాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో ఉన్న భౌగోళిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సచివాలయ హెల్త్ సెక్రటరీలకు పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు అల్లూరి జిల్లా ఉపాధ్యక్షులు ఎస్బి పోతురాజు,అరకువేలి మండల కార్యదర్శి జన్నీ భగత్ రాం పాల్గొన్నారు.

అనారోగ్యంతో సిపిఎం కార్యకర్త మృతి

ప్రజాశక్తి- అనంతగిరి : మండలంలోని ఎగువశోభ పంచాయతీ కొత్తవలస గ్రామనికి సిపిఎం సీనియర్ కార్యకర్త, కాఫీ కార్మిక సంఘం నాయకులు కొర్రా.లక్ష్మి (50) అనారోగ్యంతో మంగళవారం మరణించారు. విషయం తెలుసుకున్న స్థానిక జెడ్‌పిటిసి దీసరి గంగరాజు గ్రామానికి వెళ్లి లక్ష్మి భౌతికయానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్ష్మి మరణం కాఫీ కార్మిక సంఘానికి తీరని లోటని, కాఫీ కార్మికుల పక్షాన, వారి హక్కుల కోసం కూలీ రేట్లు కోసం పోరాడారన్నారు. లక్ష్మి ఆడుగుజాడల్లో నడుస్తూ, కార్మిక సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఎగువశోభ సర్పంచ్ కొర్రా సింహాద్రి, సిపిఎంశాఖ కార్యదర్శి గెమ్మెల పెంటన్న, కిముడు.శ్రీను, వైసిపి నాయకులు మజ్జి నాగులు, కొర్రా.చిన్నయ్య, కుటుంబ సభ్యులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

పాడె మోస్తున్న గంగరాజు, ఇతర సిపిఎం నేతలు

ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు

ప్రజాశక్తి-పెదబయలు : అరకు ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణపై సొంతపార్టీకి చెందిన వ్యతిరేకులు టిటిడి చైర్మన్, పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డికి ఫిర్యాదు చేయడం తగదని పెదబయలు మండల కన్వీనర్ కనకరాజు, కూడా అనంతరావు అన్నారు. ఎమ్మెల్సీ కుంభారవిబాబు సమక్షంలో పార్టీకి చెందిన వ్యక్తులకు ఎమ్మెల్యే ఫాల్గుణపై ఫిర్యాదు చేయడం వెనుక రాజకీయ దుర్బుద్ధి ఉందని ఆరోపించారు. గడపగడపకు ప్రభుత్వం, జగనన్న సురక్షను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల్లోకి దూసుకుపోతున్న ఎమ్మెల్యేను, ఆయా కార్యక్రమాలకు హాజరు కాని వారంతా ఫిర్యాదు చేయడం వారి విజ్ఞతకు వదిలేస్తున్నామన్నారు. పార్టీ అధిష్టానం అంతా గమనిస్తోందని, ఏది నిజమో వారికి తెలుసన్నారు. పబ్లిసిటీ కోసమే ఇలాంటి చీప్ ట్రిక్స్ మానుకోవాలని హితవు పలికారు.

నేరాలు ఘోరాలు

ప్రమాదానికి గురైన లారీలో మంటలు

లారీ నుంచి వస్తున్న పొగ

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని ఘాట్ రోడ్డు, రెండో నెంబర్ మలుపు వద్ద సోమవారం లోయలోకి దూసుకుపోయిన తౌడు లోడు లారీలో మంటలు చెలరేగాయి. ఎస్.కోట అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకుని సిబ్బంది సోమ,.మంగళవారాలు. రెండు రోజులు పాటు మంటలను ఆర్పేందుకు శ్రమించాయి. భారీ లోడుతో ఉన్న తౌడు లారీ లోయలోకి వెళ్లడంతో ట్యాంకర్‌లోని ఆయిల్ వేడిగా ఉన్న ఇంజిన్‌పై పడడంతో మంటలు చెలరేగినట్లు భావిస్తున్నారు.

ఆందోళన చేస్తున్న పూతికపుట్టు గిరిజనులు

రోడ్డు సమస్య పరిష్కరించాలని ఆందోళన

ప్రజాశక్తి- అనంతగిరి : మండలంలోని మారుమూల మారుమూల పంచాయతీలైన పెద్దకోట పినకోట. కివర్ల పంచాయతీ గ్రామాలకు ఆనుకొని ఉన్న రింగ్ రోడ్డు కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోతులు మాయంగా ఏర్పడిందని, తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాలని కివర్ల పంచాయతీ పూతికపుటు గిరిజనులు మంగళవారం ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాదల కొండబాబు, బుచ్చన్న మాట్లాడుతూ పిన్నకొట పంచాయతీ బొరపాలేం, బోనూరు, చీడిమెటు తండేవలస, గండిబంద, చటకంభ, .పెదకోట పంచాయతీ కర్రిమాడి, పందిరిమాడితో పాటు ఐదుగ్రామాలు,కివర్ల పంచాయతీ పూతికపుట్టు, జగడలమాడి, టంగెలబంద, గంగవరం, చీమరాణి తదితర రోడ్డును ఆనుకుని ఉన్న చుట్టుపక్కల గ్రామాలుప్రజలకు ప్రస్తుత వర్షాల కారణంగా బైక్, ఆటో వంటి వాహనాలు రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి ఉందన్నారు. 108 అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితితో రోగులు తీవ్ర అవస్థలకు గురవుతున్నామని, తక్షణమే ప్రభుత్వ స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు

సౌకర్యాలపై ఆరా

ప్రజాశక్తి -జి.మాడుగుల : మండలంలోని కొత్తపల్లి జలపాతాన్ని మంగళవారం పాడేరు ప్రాజెక్ట్ అధికారి వి అభిషేక్ సందర్శించారు, అక్కడ పర్యటకులకు కలుగుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు, మేనేజర్ నవీన్, సూపర్వైజర్ అభి పలు సమస్యలు పిఒ దృష్టికి తీసుకువెళ్లారు,.ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే పర్యాటకులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలన్నీ సమకూరేలా కృషి చేస్తానని తెలిపారు.

కొత్తపల్లి జలపాతం వద్ద పిఒ అభిషేక్

ముంచంగిపుట్టులో ఆశాల డిమాండ్ల పత్రాన్ని వైద్యాధికారికి అందిస్తున్న నాయకులు

7న ఆశాల సమస్యలపై ధర్నాకు తరలిరండి

ప్రజాశక్తి - కొయ్యూరు

ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 7న పాడేరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం వద్ద జరుగు ధర్నాకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎస్.సూరిబాబు పిలుపునిచ్చారు. మండలంలోని ఆర్‌జె.పాలెం పిహెచ్‌సిలో మంగళవారం జరిగిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేయకుండా ప్రభుత్వం వారి చేత వెట్టి చాకిరీ చేయించుకుంటుందని విమర్శించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, పిల్లలకు రాత్రనక, పగలనకా సేవలు అందిస్తున్న వారికి వేతనాలు పెంచకపోవడం దారుణమన్నారు. గ్యాస్, పెట్రోలు, నూనెలు, పప్పులు, కూరగాయలు, టమాటా వంటి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, దీంతో బతక లేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పింఛను సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సిహెచ్‌డబ్ల్యులను ఆశా కార్యకర్తలుగా మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ నాయకులు ఎ.దేముడమ్మ, సరోజని, సావిత్రి, రత్నకుమారి, నాగమణి పాల్గొన్నారు.

సీలేరు : ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు నాయకులు అంపరంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. జీకే వీధి మండల కేంద్రంలోని పీహెచ్సీలో మంగళవారం జరిగిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిహెచ్‌డబ్ల్యులను ఆశా కార్యకర్తలుగా గుర్తించాలని, అధికారుల వేధింపులు ఆపాలని, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని, ఆన్‌లైన్ వర్క్ భారాన్ని తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, సిహెచడబ్ల్యులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: తమ సమస్యల పరిష్కారానికి ఆశాకార్యకర్తలు, సిహెచ్‌డబ్ల్యులు ఈనెల 7న చేపట్టే చలో పాడేరు డిఎంహెచ్ఒ ఆందోళన విజయవంతం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి కె.శంకరరావు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని లబూరు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ప్రతాప్‌కు ఆశా కార్యకర్తల సమస్యలపై చేపట్టే ఆందోళనకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఎం శ్రీను, నాగేష్ పాల్గొన్నారు.

హుకుంపేట : ఈనెల 7న ఆశాల చలో డిఎంహెచ్ఒ ఆందోళన జయప్రదం చేయాలని వైస్ ఎంపిపి, సిఐటియు మండల కార్యదర్శి సూడిపల్లి కొండలరావు, తమార్బ అప్పలకొండ పడాల్, పిలుపునిచ్చారు. మంగళవారం ఉప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశావర్కర్స్‌తో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు సొంట్యాన హైమావతి, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు పుష్పలత ,కొండమ్మ, పెద్దమ్మి, శాంతి, కేసమ్మ, భారతి, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు అన్నారు. మండలంలోని బోర్నగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి తమ లక్ష్యాలను చేరుకోవాలని, ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా వినాలని సూచించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకొని, వారికి పలు సూచనలు చేశారు. అనంతరం 2022-23 సంవత్సరంలో 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో మార్కులు సాధించిన విద్యార్థులకు ఎస్సై రఘునాథరావు బహుమతులు అందజేశారు. అనంతరం రఘునాథరావును పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

అంతర్జాతీయ స్థాయికి విశాఖ

- ఇనార్బిట్ షాపింగ్ మాల్ ఓ ఆణిముత్యం
- పారిశ్రామికవేత్తలకు యుద్ధప్రాతిపదికన సాయం అందిస్తాం
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- నగరంలో పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో బిజీబిజీ

ఇనార్బిట్ మాల్ శిలాఫలకం వద్ద సిఎం జగన్మోహన్ రెడ్డి తదితరులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కేవలం ఒక్క ఫోన్ కాల్ దూరంలో మీకు మేం అందుబాటులో ఉంటాం... రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి. పారిశ్రామికవేత్తలకు ఏ విధమైన సహాయ, సహకారాలు ఇస్తున్నామో కచ్చితంగా మీరు చూస్తారు' అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విశాఖ పర్యటన సందర్భంగా రహేజా ఇనార్బిట్ మాల్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. ఇనార్బిట్ మాల్ విశాఖకు ఆణిముత్యమని వ్యాఖ్యానిస్తూ మిగిలిన రాష్ట్రాల కంటే ఎక్కువ మేలు తమ ప్రభుత్వం వల్ల పారిశ్రామికవేత్తలకు లభిస్తుందంటూ రహేజా సంస్థకు హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని అనంతపురం జిల్లా హిందూపురంలో 350 ఎకరాల్లో ఎలక్ట్రానిక్ టెక్స్‌టైల్స్ పార్క్ వల్ల 15 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని, ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. ఇనార్బిట్ మాల్ 13 ఎకరాల్లో పూర్తయ్యాక రెండోదశలో అక్కడ నిర్మించబోయే ఐటి స్పేస్ సెంటర్‌తో ఈ ప్రాంత రూపురేఖలు మారతాయన్నారు.

షాపింగ్ మాల్ ఆణిముత్యమైతే... స్టీల్‌ప్లాంట్ ఏమిటి ?

విశాఖ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రహేజా సంస్థ కైలాసపురంలో 17 ఎకరాల్లో నిర్మించబోయే ఇనార్బిట్ షాపింగ్ మాల్ 'విశాఖకు ఆణిముత్యం' అంటూ వ్యాఖ్యానించడంపై అక్కడున్న జిల్లా స్థాయి అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. విశాఖపట్నంకు బ్రాండ్ ఇమేజ్‌ను తెచ్చిన 'వైజాగ్ స్టీల్‌ప్లాంట్'ను కేంద్ర ప్రభుత్వం 100 శాతం అమ్మకానికి పెడితే.. ఆ విషయాన్ని పట్టించుకోకుండా నిర్మాణమేకాని ఓ షాపింగ్ మాల్‌కు స్వయంగా ముఖ్యమంత్రి కితాబు ఇవ్వడం పట్ల అభ్యంతరంగా ఒకరి ముఖాలు మరొకరు చూసుకోవడం, ఇదో 'వింత' అంటూ కొద్ది మంది వ్యాఖ్యానించుకోవడం కనిపించింది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ గురించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాట మాత్రమైనా ప్రస్తావించలేదు. లక్షల మంది ఉపాధి పొందుతూ రాష్ట్ర స్థూల ఉత్పత్తికి రూ.వేల కోట్ల సాయం అందించే వైజాగ్ బ్రాండ్ స్టీల్ ప్లాంట్‌పైనగానీ, గంగవరం పోర్టు సృష్టిస్తున్న 'కోల్' ఆటంకాలపైనగానీ ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంటుందన్న అంశం జోలికి జగన్ పోలేదు.

నిరాశ మిగిల్చిన పర్యటన

సిఎంకు ఘనంగా స్వాగతం పలికేందుకు ఎయిర్ పోర్టు నుంచి కైలాసపురంలోని ఇనార్బిట్ మాల్ వరకూ దారి పొడవునా వైసిపి కార్యకర్తలు, కొంతమంది సాధారణ జనం, మహిళలు పెద్ద సంఖ్యలో ఉదయం 9 గంటలకే విచ్చేశారు. ఆయన విశాఖ ఎయిర్ పోర్టుకు 11 గంటలకు వచ్చాక రోడ్డు మార్గంలో వారికి కారులోంచే అభివాదం చేసుకుంటూ ఇనార్బిట్ మాల్‌కు విచ్చేశారు. లోపల శంకుస్థాపన, సిఎం ప్రసంగం సాగుతుండగా బయట వేచివున్న వేల సంఖ్యలో మహిళలు అసంతృప్తి వ్యక్తం చేయడం కనిపించింది. ముఖ్యమంత్రి ఏం మాట్లాడుతారో వినాలని విచ్చేసిన తమకు నిరాశ ఎదురైందంటూ ఈ సందర్భంగా వారు అసంతృప్తిని వ్యక్తం చేశారు. అదే విధంగా ఆంధ్రా యూనివర్సిటీకి చెందిన సుమారు రెండు వేల మంది విద్యార్థులతో సిఎం వైఎస్ జగన్ ఇంటరాక్షన్ అవ్వనున్నారని ఈ నెల 31 సోమవారం వరకూ అధికారులు ప్రకటించారు. తీరా చూస్తే చివరి నిమిషంలో ఈ ఇంటరాక్షన్‌ను రద్దు చేశారు. దీంతో విద్యార్థుల్లోనూ అసంతృప్తి రేగింది.

సిఎం ప్రసంగంలో పదనిసలు

ఇనార్బిట్ మాల్‌కు భూమి పూజ చేసిన అనంతరం జగన్ మాట్లాడుతూ రహేజాకు కేటాయించిన 17 ఎకరాల్లో 13 ఎకరాల్లో మాల్ వస్తుందని, మిగతా ప్రదేశమైన రెండున్నర లక్షల చదరపు అడుగుల స్థలంలో ఐటి సంస్థ, అంతర్జాతీయ స్థాయి కన్వెన్షన్ సెంటర్ రెండో దశలో రానున్నాయని అనడానికి బదులు రెండున్నర లక్షల ఎకరాల్లో అంటూ సిఎం అనడంతో అక్కడగల ప్రజలు, అధికారులు నివ్వెరపోయారు.

సభా వేదికపై కెకె.రాజు.. కిందన ఎమ్మెల్యేలు

కైలాసపురం వద్ద జరిగిన సిఎం సభలో వేదికపై వైసిపి ఉత్తర నియోజక వర్గ సమన్వయకర్త కెకె.రాజు ఆశీనులై ఎమ్మెల్యేలంతా వేదిక దిగువన కూర్చోవడం చర్చనీయంశంగా మారింది.. విశాఖపట్నం ఎంపీ ఎంవివి సత్యనారాయణ కూడా కెకె.రాజు తర్వాత కూర్చొనడం అందరినీ నివ్వెరపరచినట్టయింది. వైసిపికి చెందిన సీనియర్ ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులంతా దిగువకే పరిమితం అయ్యారు. కెకె.రాజుకు ఎందుకంత ప్రాధాన్యం అంటూ వారిలోవారే గుస్సా అయ్యారు.

ఎయులో రూ.130 కోట్ల విలువైన 5 ప్రాజెక్టులు ప్రారంభం

ఎంవిపి.కాలనీ : సిఎం జగన్ తన విశాఖ పర్యటనలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం ఆంధ్ర విశ్వ విద్యాలయానికి చెందిన ఐదు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. తొలుత ఎయు ప్రిన్సిపల్స్, ఇతర అధికారులను ముఖ్యమంత్రికి వీసీ ప్రసాద్‌రెడ్డి స్వయంగా పరిచయం చేశారు. ఎలిమెంట్ భవనం బయట పెద్ద సంఖ్యలో విద్యార్థులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో సిరిపురం వద్దనున్న ఫార్మా ఇంక్యుబేషన్, బయో మానిటరింగ్ హబ్- ఎలిమెంట్‌కి చేరుకున్నారు. అక్కడ మొదటగా ఎలిమెంట్ భవనాన్ని ప్రారంభించిన అనంతరం అదే వేదిక నుంచి మరో నాలుగు భవనాల శిలాఫలకాలను ఆవిష్కరించారు. మూడు సంవత్సరాలుగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 18 ప్రాజెక్టులు చేపట్టగా వీటిలో ఐదు ప్రాజెక్టులను సిఎం ఆరంభించారు. వీటిలో టెక్ స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్, ఫార్మా ఇంక్యుబేషన్ ఎలిమెంట్, ఎయు డిజిటల్ జోన్ అండ్ స్మార్ట్ క్లాస్ రూమ్ కాంప్లెక్స్ అల్గారిథమ్, ఎయు స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, ఎయు అవంతి ఆక్వా కల్చర్ ఇన్నోవేషన్ స్కిల్ హబ్ ఉన్నాయి.

జోరు వానలో నినాదాలు చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

జోరువానలోనూ విద్యుత్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - సీలేరు : ప్రభుత్వం మొండివైఖరి విడనాడి విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన కోరికల్ని పరిష్కరించాలని కోరుతూ జీకే వీధి మండలం సీలేరులో ఏపీ జెన్కో విద్యుత్ ఉద్యోగులు తమ నిరసన కార్యక్రమం నాలుగో రోజు మంగళవారం మరింత ఉధృతం చేశారు. ముందు భోజనం విరామ సమయంలో ఏపీ జెన్కో ఈఈ లక్ష్మీనారాయణ కార్యాలయం ఎదుట ఇంజనీర్లు, కాంట్రాక్టు కార్మికులు ఐక్యంగా ఆందోళన చేపట్టారు. ఈఈ కార్యాలయం నుంచి మార్కెట్ సెంటర్ వరకు వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా నిరసన ర్యాలీ చేశారు. 'కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి, విద్యుత్ ఉద్యోగులు న్యాయమైన కోర్కెలను తక్షణమే నెరవేర్చాలి' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగుల జెఏసి నాయకులు వై.ధారాజు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు పే రివిజన్ అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు డైరెక్ట్ పేమెంట్ చేయాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్కో ఇంజనీర్లు ఏడిఈ సత్యనారాయణ, శ్రీకాంత్, ఏఇలు రమేష్, ప్రసాద్, కాంట్రాక్ట్ కార్మిక సంఘ నాయకుడు బి.లక్ష్మణ్, విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.


జమాల్ ఖాన్‌ను సత్కరించిన ఆదర్శ రైతులు, బిఆర్ఎస్ నాయకులు

ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్‌కు సన్మానం

ప్రజాశక్తి - ఎటపాక : మండల కేంద్రంలోని ఆయుర్వేద దవాఖాన వైద్యులు జమాల్ ఖాన్‌ను తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం బండిరేవు గ్రామానికి చెందిన ఆదర్శ రైతులు, బిఆర్ఎస్ నాయకులు సాగిన శ్రీనివాసరాజు, జోగిరాజు వీరభద్ర రాజు, చినరాజు సుబ్రహ్మణ్యం మంగళవారం శాలువాతో సన్మానించినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యూఢిల్లీలోని అంతర్జాతీయ అంబేద్కర్ కేంద్రంలో వరల్డ్ కాంగ్రెస్ సాంప్రదాయ వైద్యం మూడవ మహసభ జమాల్ ఖాన్‌ను రాష్ట్రీయ అవార్డు, సిల్వర్ స్టార్ అవార్డుతో సత్కరించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఆయుర్వేదం గొప్పతనాన్ని దేశం నలమూలాలకు చాటేలా జమాల్ ఖాన్ సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మానె రామకృష్ణ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై నిరసన

ప్రజాశక్తి -కొయ్యూరు మణిపూర్‌లో కుక్కి తెగ ప్రజలపై దాడులు, స్త్రీలపై అత్యాచారాలు, హత్యలు వంటి సంఘటనలను నిరసిస్తూ కొయ్యూరు మండల క్రైస్తవ సమాజం ఆధ్వర్యాన మంగళవారం మండల కేంద్రంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక స్త్రీ మూర్తిని దిగంబరంగా రెండు కిలోమీటర్లు నడిపించిన దుర్ఘటనపై అక్కడి ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులుగాని, స్పందించక పోవడం దారుణమన్నారు. దీనిపై ప్రధానమంత్రి తగు చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు మండలం పాస్టర్లు, పాల్గొన్నారు.